సాక్షి
మెదక్
బుధవారం । 10 । జూలై । 2024



పశువైద్యశాలల్లో మందుల కొరత

పశువులకు సోకే రోగాలను నయం చేసేందుకు, శస్త్ర చికిత్స జరిగిన జీవాలను కాపాడుకునేందుకు పశుపోషకులు నానా ఇబ్బందులు పడుతున్నారు. వివరాలు 8లో ▸



మూతపడ్డ పాఠశాల

టీచర్ ఉన్నా విధులకు రాకపోవడంతో ఓపాఠశాల మూతపడింది. విద్యార్థులు టీచర్ రాక కోసం ఎదురు చూసి ఇళ్లకు వెళ్లిపోయారు. వివరాలు 9లో ▸



పౌష్టికాహారంతోనే ఆరోగ్యం

ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించి పౌష్టికాహారం తీసుకోవాలని పీడీఎంఓ డాక్టర్ శ్యామల సూచించారు. వివరాలు 9లో ▸

న్యూస్‌రీల్

బీమా ఇప్పించిన జడ్జి



ఇన్సూరెన్స్ పత్రం అందజేస్తున్న జడ్జి

మెదక్‌జోన్: జిల్లా కోర్టులో మంగళవారం ప్రత్యేక లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి లక్ష్మీశారద వాహన ప్రమాదం కేసులో రెండు పక్షాల మధ్య రాజీ కుదిర్చారు. అనంతరం బాధిత కుటుంబానికి ఇన్సూరెన్స్ సంస్థ నుంచి నష్ట పరిహారం ఇప్పించారు. జిల్లాలోని చిన్నశంకరంపేట మండలం టి.మాందాపూర్ గేట్ వద్ద 2022 ఫిబ్రవరి 14న జరిగిన ప్రమాదంలో లోకేశ్(15) మృతి చెందాడు. ఈ కేసులో జడ్జి ఇన్సూరెన్స్ కంపెనీ ద్వారా వారికి రూ.7లక్షల పరిహారం ఇప్పించారు. కార్యక్రమంలో న్యాయవాదులు సి.పోచయ్య, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌చార్జి ఏజీపీగా సుధాకర్



నర్సాపూర్: స్థానిక న్యాయవాది పాముల సుధాకర్ ఇన్‌చార్జి ఏజీపీగా నియామకం అయ్యారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో ఇన్‌చార్జి అసిస్టెంటు గవర్నమెంటు ప్లీడర్‌గా విధులు నిర్వహించడానికి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని చెప్పారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు.

పారిశుద్ధ్య కార్మికులు అవసరం



రవీందర్‌గౌడ్

రామాయంపేట(మెదక్): ప్రభుత్వ పాఠశాలల్లో పారిశుద్ధ్య కార్మికులను పునరుద్ధరించాలని తెలంగాణ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రవీందర్‌గౌడ్ విజ్ఞప్తి చేశారు. మంగళవారం ఆయన రామాయంపేటలో మాట్లాడుతూ స్కూళ్లలో పారిశుద్ధ్య కార్మికులు లేకపోవడంతో పాఠశాలల నిర్వహణ ఇబ్బందికరంగా మారిందన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా లేకపోతే విద్యార్థులు వ్యాధుల బారినపడే అవకాశం ఉందని, ప్రభుత్వం పునరాలోచించాలని ఆయన కోరారు.

నేడు శాంతియుత సత్యదీక్ష



మాట్లాడుతున్న శ్రీనివాస్

మెదక్‌జోన్: కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలనే డిమాండ్‌తో కిసాన్ మోర్చా పిలుపు మేరకు బుధవారం కలెక్టరేట్ సమీపంలో శాంతియుత సత్యాగ్రహ దీక్ష చేస్తామని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం ఆయన పార్టీ కార్యాలయంలో మాట్లాడుతూ రైతు భరోసా, రుణమాఫీ, కౌలురైతులకు భరోసా, వ్యవసాయ కూలీలకు ఏడాదికి రూ.12వేలు, కౌలురైతులకు రూ.15వేలు లాంటి పథకాలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జనార్దన్‌రెడ్డి, ఎంఎల్ఎన్ రెడ్డి, ప్రసాద్ పాల్గొన్నారు.

అయోమయానికి గురికావొద్దు



జీఓ కాపీలను చూపుతున్న నరేందర్

మెదక్‌జోన్: ఉద్యోగ సంఘ ప్రాథమిక సభ్యుల ద్వారా ఎన్నికైన ఆఫీస్ బేరర్లు అయోమయానికి గురికావొద్దని టీఎన్‌జీఓ జిల్లా అధ్యక్షుడు దొంత నరేందర్ సూచించారు. మంగళవారం స్థానిక సంఘం భవన్‌లో ఆయన మాట్లాడుతూ బదిలీల ప్రక్రియలో ఒకే ప్రాంతంలో చేసినటువంటి సర్వీసు, ఉద్యోగ సంఘంలో ఆఫీస్ బేరర్‌గా ఉన్న సర్వీస్‌కు ఏ సంబంధం లేదన్నారు. ఆరేళ్ల అనంతరం బదిలీకి ఆస్కారం ఉందని చెప్పారు. అధ్యక్ష కార్యదర్శులకు ఎటువంటి పరిమితి లేదని తెలిపారు. ఆయనతోపాటు జిల్లా కార్యదర్శి రాజ్ కుమార్ తదితరులు ఉన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

చేర్యాల(సిద్దిపేట): అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు ఎస్ఐ దామోదర్ తెలిపారు. మంగళవారం సాయంత్రం సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీలు చేపట్టామన్నారు. మండల పరిధిలోని చుంచనకోట సమీపంలో ఆటోలో తరలిస్తున్న 13 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు తెలిపారు.

మెడికల్ కళాశాలకు మంగళం!

- సిబ్బంది, సౌకర్యాలు లేక అనుమతి నిరాకరణ
- తిరిగి అప్పీల్ చేసేందుకు ప్రయత్నాలు

మెతుకు సీమకు మెడికల్ కళాశాల మంజూరైందంటే జిల్లా ప్రజలు ఎంతో సంతోషించారు. ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్న కల నెరవేరిందని సంబురపడ్డారు. కళాశాల నిర్మాణానికి గత ప్రభుత్వం రూ.150 కోట్లు మంజూరైనట్టు ప్రొసీడింగ్‌ను కూడా విడుదల చేసింది. అయితే మెడికల్ కళాశాల ఏర్పాటుకు సరైన వసతులులేవని, సిబ్బంది కొరత కూడా ఉందనే కారణంతో జాతీయ వైద్య మండలి కళాశాల అనుమతిని నిరాకరించింది. ఈ పిడుగులాంటి వార్తతో జిల్లా ప్రజలు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. – మెదక్‌జోన్



ప్రైవేట్ భవనంలో ఏర్పాటు చేసిన మెడికల్ కళాశాల

జిల్లాకు 2023లో మెడికల్ కళాశాల మంజూరైంది. దీంతో కళాశాల నిర్మాణానికి స్థలాన్ని పరిశీలించారు. ప్రస్తుతం ఎంసీహెచ్ ఆస్పత్రి పక్కనే క్రిటికల్ కేర్ ఆస్పత్రి భవనం నిర్మిస్తున్నారు. మెడికల్ కళాశాల ఏర్పాటుకు 350 పడకల ఆస్పత్రి అందుబాటులో ఉండాలనేది నిబంధన. అయితే జిల్లా కేంద్ర ఆస్పత్రితోపాటు ఎంసీహెచ్, ఆస్పత్రులు ఉన్నాయని మెడికల్ కళాశాల నిర్వహణకు సరిపోతుందని నిర్ణయించారు.

భవనానికి గ్రీన్ సిగ్నల్

మెడికల్ కళాశాల నూతన భవనం నిర్మాణం పూర్తయ్యే వరకు పిల్లికోటాల్‌లోని పాత కలెక్టరేట్ భవనం మెడికల్ కళాశాలకు అనువుగా ఉంటుందని సంబంధిత అధికారులు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. మెదక్ ప్రభుత్వ వైద్యకళాశాల అనే బోర్డును సైతం తగిలించారు. ఆ భవనంలో కొనసాగుతున్న బాలికల గురుకుల పాఠశాలను రామాయంపేటకు తరలించారు. అంతా ఓకే అనుకున్న సమయంలో ఒక్కసారిగా అనుమతులు నిరాకరించడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

ముందుకు రాని సిబ్బంది

మెడికల్ కళాశాలలో ఎనిమిది డిపార్ట్‌మెంట్‌లు ఉంటాయని. ఫస్టియర్‌లో మాత్రం 4 నుంచి 5 డిపార్ట్‌మెంట్‌లు అవసరం ఉంటుందని ఓ డాక్టర్ తెలిపారు. సెకండ్ ఇయర్‌కు మరికొన్ని డిపార్ట్స్‌మెంట్‌లు పెరిగే అవకాశం ఉంటుంది. నాలుగున్నర సంవత్సరాలు కోర్సు ఉండగా ఒక్క సంవత్సరం పాటు హౌస్‌సర్జన్ ఉంటుంది. మెడిసిన్ పూర్తిచేసేందుకు మొత్తం ఐదున్నర సంవత్సరాల సమయం పడుతుంది. మొదటి సంవత్సరంలో అటానమీ, ఫిజియాలజీ, బయోకెమిస్ట్రీ, ఎస్‌పీఎం ప్రధానమైన కోర్సులు. సెకండ్ ఇయర్‌లో మరికొన్ని అదనంగా పెరుగుతాయి. అటానమి ప్రొఫెసర్, మరో ఇద్దరు అసోసియేట్ ప్రొఫెసర్‌లు, అసిస్టెంట్ ప్రొఫెసర్‌లు, ట్యూటర్‌లతోపాటు ఒక్కో డిపార్ట్‌మెంట్‌లో 10 నుంచి 12మంది డాక్టర్లు అవసరం. అయితే మెదక్ మారుమూల ప్రాంతం అని భావించి వైద్యులు ముందుకు రావడం లేదని సమాచారం. అందుకే సిబ్బంది కొరతను కారణంగా చూపించి కళాశాలకు అనుమతులు నిరాకరించినట్టు తెలిసింది.

మళ్లీ ప్రయత్నిస్తాం..

సిబ్బంది లేరనే కారణంగా మెడికల్ కళాశాలకు జాతీయ వైద్యమండలి అనుమతులు నిరాకరించిన విషయం వాస్తవమే. ప్రస్తుతం డీఎంఈ వద్ద రిక్రూట్‌మెంట్ జరుగుతోంది. మంగళవారం 20మంది డాక్టర్లు వచ్చారు. మరో 2, 3 రోజుల్లో పూర్తిస్థాయిలో సిబ్బందిని రప్పించి అనుమతుల కోసం మళ్లీ అప్పీల్ చేస్తాం.

– రవికుమార్, ప్రిన్సిపాల్, మెదక్ మెడికల్ కళాశాల



వీడియో కాన్ఫరెన్స్ పాల్గొన్న కలెక్టర్ రాహుల్‌రాజ్

వన మహోత్సవానికి సిద్ధంకండి

- లక్ష్యాల మేరకు మొక్కలు నాటాలి
- కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్ కలెక్టరేట్: వనమహోత్సవ కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సచివాలయం నుంచి కలెక్టర్‌లతో మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వనమహోత్సవం, మహిళాశక్తి పథకం, అమ్మ ఆదర్శ పాఠశాల, విద్యార్థులకు యూనిఫాంలు, సీజనల్ వ్యాధుల నియంత్రణ, ధరణి సమస్యలు, ఉద్యోగుల బదిలీ అంశాలపై సమీక్షించారు. మెదక్ కలెక్టరేట్ నుంచి కలెక్టర్ రాహుల్ రాజ్, అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు ఇతర అధికారులు పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో వనమహోత్సవ కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. అలాగే ఎవెన్యూ ప్లాంటేషన్, బండ్ ప్లాంటేషన్, కెనాల్ వర్క్ ప్లాంటేషన్‌లకు జిల్లా గ్రామీణ అభివృద్ధిశాఖ ద్వారా లొకేషన్స్‌ను గుర్తించాలని సూచించారు. మండల అభివృద్ధి అధికారులకు టార్గెట్ నిర్దేశించి ఉపాధి హామీ కూలీల ద్వారా పనులు పూర్తిచేయాలని చెప్పారు. మహిళాశక్తి కేంద్రాలు, మహిళా సమాఖ్య క్యాంటీన్ ఏర్పాటు, సూక్ష్మ మధ్యతరహా పరిశ్రమల ఏర్పాట్లు, ధరణి పెండింగ్ దరఖాస్తులు, సీజనల్ వ్యాధులు, విద్యార్థులకు యూనిఫాం, నోట్‌బుక్స్ టెక్ట్ బుక్స్ పంపిణీపై అధికారులకు సూచనలు చేశారు. సమావేశంలో మెదక్, తూప్రాన్, నర్సాపూర్ ఆర్డీఓలు రమాదేవి, జయచంద్రారెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి, డీఈఓ రాధాకిషన్ పాల్గొన్నారు.

గనుల ప్రైవేటీకరణను ఆపాలి



సమావేశంలో పాల్గొన్న వివిధ సంఘాల నాయకులు

సీఐటీయూ నేత మల్లేశం

మెదక్ కలెక్టరేట్: బొగ్గు గనుల ప్రైవేటీకరణను వెంటనే నిలిపివేయాలని, శ్రావణపల్లి బొగ్గు గనులను సింగరేణికి అప్పగించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు మల్లేశం డిమాండ్ చేశారు. మంగళవారం కేవల్ కిషన్ భవన్‌లో సింగరేణి బొగ్గు గనుల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కేంద్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని కార్మిక సంఘాలు సింగరేణి ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాటాలు నిర్వహిస్తున్నాయన్నారు. కేంద్రంలో బీజేపీ మళ్లీ అధికారంలోకి వచ్చాక శ్రావణపల్లి బొగ్గు గనుల వేలం పాటను ప్రకటించిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే అరబిందో సంస్థకు బొగ్గుగనిని అప్పగించిందని వాపోయారు. కేంద్ర ప్రభుత్వం సింగరేణి వేలంపాటను రద్దుచేసి, ప్రైవేటీకరణను ఆపాలని కార్మిక సంఘం నాయకులు రౌండ్ టేబుల్ సమావేశంలో తీర్మానం చేశారు. లేనిపక్షంలో పోరాటం నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నేతలు బసవరాజు, నర్సమ్మ, నందం, అజయ్, కమల, సత్యం తదితరులు పాల్గొన్నారు.

రసాయనం.. ప్రమాదకరం

నిర్లక్ష్యం వహిస్తే ప్రాణాలకు ముప్పు

- స్వీయ రక్షణకు జాగ్రత్తలు అవసరం
- మాస్క్, హెల్మెట్, గ్లౌజ్‌లు ధరించాలి
- ఏఈఓ రాజశేఖర్‌గౌడ్



రాజశేఖర్‌గౌడ్, ఏఈఓ కొడిపల్లి

కౌడిపల్లి(నర్సాపూర్)/ కొల్చారం(నర్సాపూర్): ప్రస్తుతం సాగులో చీడపీడలు సోకని పంటలేదు. వాటి బెడద నుంచి వరి, పత్తి ఇతర పంటలను కాపాడుకోవడం, గడ్డి మొలకెత్తకుండా ఉండేందుకు రైతులు రసాయన మందులు స్ప్రే చేయడం తప్పనిసరైంది. పంట చేతికందే వరకు నాలుగు నుండి ఆరుసార్లకు పైగా రసాయన మందులు స్ప్రే చేయాల్సి వస్తుంది. అయితే రసాయనాలు స్ప్రే చేసేటప్పుడు రైతులు తగిన జాగ్రత్తలు పాటించకపోతే ప్రాణాలకే ముప్పు ఏర్పడే అవకాశం ఉంది. ఈ ప్రమాదకర రసాయన ఎరువుల నుంచి తమను తాము రక్షించుకోవడానికి తప్పనిసరిగా కొన్ని జాగ్రత్తలు పాటించాలి. అందుకు ఏఈఓ రాజశేఖర్‌గౌడ్, కొల్చారం మండల వ్యవసాయ అధికారి శ్వేతా కుమారి ఇచ్చిన కొన్ని సలహాలు, సూచనలు.

- రసాయనిక మందులు స్ప్రే చేసేటప్పుడు నోరు, ముక్కు ద్వారా క్రిమిసంహారక మందు శరీరంలోనికి వెళ్లకుండా మాస్క్ తప్పనిసరిగా ధరించాలి. కళ్లలోకి మందు వెళ్లకుండా ఉండేందుకు హెల్మెట్ ధరిస్తే మరీ మంచిది.
- మందును ట్యాంక్‌లో కలిపేటప్పుడు గ్లౌజ్‌లను ధరించాలి. కట్టె ఇతర వస్తువులతో కలపాలి.
- స్ప్రే చేసే సమయంలో నీళ్లు తాగడం, బీడీ సిగరెట్ పీల్చడం లాంటి పనులు చేయవద్దు.
- గాలి వీచేటప్పుడు ఎదురుగా స్ప్రే చేయవద్దు. ఇలాచేస్తే ఆ రసాయం శరీరంపైకి వస్తుంది. అది చర్మ వ్యాధులకు దారితీస్తుంది. గాలివీచే దిశను గమనించి స్ప్రే చేసుకోవాలి.
- సాధ్యమైనంత వరకు గాలి, ఎండ ఉన్న సమయంలోనే స్ప్రే చేయాలి.
- స్ప్రే అనంతరం చేతులు, నోరు, ముక్కు సబ్బుతో శుభ్రంగా కడుక్కుని స్నానం చేసిన తరువాత మాత్రమే ఆహార పదార్థాలు తినాలి.



తగు జాగ్రత్తలతో పిచికారీ చేస్తున్న రైతు

- పంటలకు తెగులు, పురుగులు సోకితే రైతులు సొంతంగా క్రిమిసంహారక మందులు కొనుగోలు చేయవద్దు.
- వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తల సూచన మేరకు సూచించిన మందులను తగిన మోతాదులోనే వాడాలి.
- స్ప్రేచేసే సమయంలో రైతులు పూర్తిస్థాయిలో నిండుగా దుస్తులు ధరించడం మంచిది.
- రసాయన మందులు ప్రాణాంతకం. ముక్కు, నోటి ద్వారా వాటిని పీల్చడంవల్ల అవి నేరుగా ఊపిరితిత్తులలోనికి చేరి ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతాయి. అనారోగ్యానికి గురికావడంతోపాటు ఒక్కోసారి ప్రాణాలకు సైతం ముప్పు ఏర్పడుతుంది. వీలైనంత మేరకు జాగ్రత్తలు పాటించాలి.

ఇంటి నుంచే ఆర్టీఏ సేవలు

ఇంటి నుంచే ఆర్టీఏ సేవలు పొందొచ్చు. ఇప్పుడు శ్రమ, సమయం రెండూ ఆదా చేసుకోవచ్చు. వినియోగదారుల గడప వద్దకే డాక్యుమెంట్లు వచ్చేలా సేవలను అందిస్తున్నాం. అందుకు తగిన విధంగా నిబంధనలను అమలు చేస్తున్నాం. వాహనదారులు రోడ్డు సేఫ్టీ నిబంధనలు అనుసరిస్తూ క్షేమంగా గమ్య స్థానాలకు చేరుకునేలా అవగాహన కల్పిస్తున్నాం. తల్లిదండ్రులు మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దంటూనే అనుకోని ఘటనలను వివరిస్తూ జాగృతం చేస్తున్నాం. బడి బస్సు డ్రైవర్లు కనీసం ఐదేళ్ల అనుభవజ్ఞులై ఉండాలి.. అప్పుడే సురక్షితంగా చిన్నారులు గమ్య స్థానాలకు చేరుకుంటారు అని రవాణాశాఖ ఉమ్మడి జిల్లా డిప్యూటీ కమిషనర్ వెంకటరమణ తెలిపారు. మంగళవారం సాక్షి ఇంటర్వ్యూలో ఆయన పలు ఆసక్తికర విషయాలను వివరించారు. ఆయన మాటల్లోనే..

ఆన్‌లైన్ ద్వారా 19 సేవలు

- రోడ్డు భద్రతా నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు
- తల్లిదండ్రులు మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దు
- స్కూల్ బస్ డ్రైవర్లకు ఐదేళ్ల అనుభవం తప్పనిసరి
- సాక్షితో రవాణాశాఖ డిప్యూటీ కమిషనర్ వెంకటరమణ

సంగారెడ్డి: వినియోగదారులకు మెరుగైన సేవలు అందిస్తున్నాం. వారి మన్ననలు పొందేందుకు యత్నిస్తున్నాం. నేరుగా ప్రజలకు ఆన్‌లైన్ ద్వారా డ్రైవింగ్ లైసెన్స్, రిజిస్ట్రేషన్‌తోపాటు 19 సేవలు అందుబాటులోకి తెచ్చాం అని ట్రాన్స్‌పోర్ట్ ఉమ్మడి జిల్లా డిప్యూటీ కమిషనర్ వెంకటరమణ వెల్లడించారు. వినియోగదారులకు తగిన సలహాలు, సూచనలిచ్చారు. జీఓ 35 ప్రకారం స్కూల్ బస్సుల విద్యార్థులకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ప్రతిఒక్కరూ బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలి. ఆర్టీఓ నిబంధనలను పాటించాలి. గమ్య స్థానాలకు క్షేమంగా చేరుకోవాలి. కాగా, తల్లిదండ్రులు డ్రైవింగ్ రాని తమ పిల్లలకు వాహనాలు ఇవ్వొద్దు. మైనర్‌లు ఒకవేళ డ్రైవింగ్ చేసి ప్రమాదాల బారిన పడితే జీవితంలో అనేక సమస్యలను ఎదుర్కొంటారు. వారితోపాటు తల్లిదండ్రులపై రోడ్డు రవాణా యాక్ట్ ప్రకారం చర్యలు తీసుకుంటాం. కాబట్టి పిల్లల పట్ల జాగ్రత్తలు వహించండి. ప్రజలందరూ రోడ్డు భద్రత నిబంధనలు తప్పకుండా అనుసరించాలి. ఉమ్మడి జిల్లాలోని ప్రజలు ఆర్టీఓ సేవలను వెబ్‌సైట్ ద్వారా సులభతరంగా ఇంటి నుంచే సేవలు పొందాలి.

ఆన్‌లైన్ ద్వారా సేవలు

వినియోగదారులు గతంలో కార్యాలయం చుట్టూ తిరిగేవారు దీంతో శ్రమతో పాటు డబ్బు ఖర్చు ఉండేది. ప్రస్తుతం ఇంటి దగ్గర నుంచే ఆన్‌లైన్ ద్వారా ఫొటో మార్పు, లైసెన్స్ రెన్యువల్, ఆధార్ అప్‌డేట్ తదితర సేవలను ఆన్‌లైన్ ద్వారా పొందొచ్చు. పోస్ట్ ద్వారా సంబంధిత డాక్యుమెంట్స్ ఇంటి వద్దకే వస్తాయి. అలాగే సీట్ బెల్ట్, డ్రైవింగ్ లైసెన్స్, ఫిట్‌నెస్ తదితర నియమాలు పాటించిన బెస్ట్ డ్రైవర్లను సన్మానిస్తాం. అతిక్రమించిన వారిపై తగు చర్యలు తప్పవు.



విద్యాసంస్థలు పాటించాల్సినవి..

పాఠశాల/కళాశాల పేరు, టెలిఫోన్ నంబర్, ముబైల్ నంబర్ సహా పూర్తి చిరునామా బస్సు ఎడమ వైపు ముందు భాగంలో స్పష్టంగా కనిపించేలా రాయించాలి. బస్సు డ్రైవర్‌గా వయసు 60 ఏళ్లకు మించి ఉండరాదు. పాఠశాల/కళాశాల యాజమాన్యం, ప్రతి బస్సు డ్రైవర్ ఆరోగ్య పట్టిక నిర్వహించాలి. రక్తపోటు (బీపీ), షుగర్, కంటిచూపు వంటి ప్రాథమిక ఆరోగ్య పరీక్షలు, ప్రతి మూడు నెలలకొకసారి తమ సొంతఖర్చుపై పాఠశాల–కళాశాల యాజమాన్యమే చేయించాలి. 5 ఏళ్ల అనుభవజ్ఞులైన డ్రైవర్లనే నియమించాలి. వాహనానికి సంబంధించిన బాహ్య పరికరాలు, విండ్ స్క్రీన్, వైపర్, లైటింగ్స్, తదితరాలను మెకానికల్ కండిషన్ తీరును తెలుసుకోవాలి. ఈ విషయమై నెలకొకసారి ప్రిన్సిపాల్, పేరెంట్స్ కమిటీ తనిఖీ చేయాలి. ఫిర్యాదుల పుస్తకం ప్రతి వాహనంలో అందుబాటులో ఉండాలి. ప్రతి వాహనంలో అత్యావసర ద్వారం ఏర్పాటు చేయాలి. ప్రతి విద్యాసంస్థ బస్సుకు కనీసం ఒక అటెండర్ తప్పనిసరి. అయితే ఎట్టి పరిస్థితుల్లోను అతను వాహనం నడపడానికి అనుమతించరాదు. తెలంగాణ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ పేర్కొన్న విధంగా డ్రైవర్, అటెండర్‌లు యూనిఫాంలు విధిగా ధరించాలి. అయితే విద్యార్థులు ఎక్కడం, దిగడం సరిగ్గా స్పష్టంగా గమనించేందుకు కుంభాకార అద్దాలు అమర్చుకోవాలి. ఫైర్ ఎక్స్‌టింగ్విషర్ పౌడి అందుబాటులో ఉండాలి. పరిమిత సీటింగ్ కేపాసిటీ కన్నా ఎక్కువ మందిని తీసుకెళ్లరాదు.

నిబంధనలు ఇవే..

విధిగా డ్రైవింగ్ లైసెన్స్ పొందాలి. రైట్ రూట్‌లోనే వాహనం వెళ్లాలి. టూ వీలర్ వాహనదారులైతే హెల్మెట్ తప్పనిసరిగా ధరించాల్సిందే. ఫోర్ వీలర్ అయితే సీట్ బెల్ట్ పెట్టుకోవాలి. వెహికల్ సంబంధించిన అన్ని పేపర్స్ దగ్గర ఉండాలి. డ్రైవింగ్ సమయంలో జాగ్రత్తగా ఉంటూ క్షేమంగా ఇంటికి వెళ్లాలి. ప్రతి డ్రైవర్‌ను ఇదే కోరుతున్నాం.

డ్రైవర్లకు రహదారి భద్రతపై తరగతులు నిర్వహణ

ప్రతి విద్యాసంస్థ డ్రైవర్ సంవత్సరానికి ఒకసారి ఏప్రిల్ / మే నెలలో జేటీసీ/ డీటీసీ/ ఆర్టీఓ ద్వారా నిర్వహించే ఒక్క రోజు శిక్షణకు హాజరుకావాలి. అనంతరం బస్సులో ఒక టీచర్, ఒక పేరెంట్ ప్రయాణించేలా చూడాలి. వారు వాహనం ముందు భాగంలో కూర్చుని విద్యార్థుల సంరక్షణను చూడాల్సి ఉంటుంది. ఎక్కేటప్పుడు, దిగేటప్పుడు అటెండెంట్ బస్సు బయట నిలబడాల్సి ఉంటుంది అని జిల్లా డిప్యూటీ కమిషనర్ తెలిపారు.

బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయండి

దుబ్బాకటౌన్: ప్రభుత్వ శాఖల్లో నిరుదోయగ దివ్యాంగులకు బ్యాక్‌లాగ్ పోస్టులను ప్రభుత్వం వెంటనే భర్తీ చేయాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా అధ్యక్షుడు సాజిద్ కోరారు. మంగళవారం దుబ్బాక సీఐటీయూ కార్యాలయంలో దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా మహా సభల కరపత్రం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2011 జనాభా లెక్కల ప్రకారం దేశంలో 2.21 శాతం మంది దివ్యాంగులు ఉన్నారన్నారు. వారికి ప్రభుత్వ, ప్రభుత్వేతర సౌకర్యాలు అందడం లేదని ఆరోపించారు. రాష్ట్రంలో 40లక్షల మంది ఉంటే కేవలం 5.75 లక్షల మందికే పెన్షన్ అందుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.

క్లుప్తంగా

బైక్ రైడర్స్ అరెస్టు



బైక్ రైడర్స్‌ను అరెస్టు చేసిన పోలీసులు

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని రంగనాయక సాగర్ రిజర్వాయర్‌పై బైక్ రైడ్ చేసిన యువకులను మంగళవారం అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ బాలకృష్ణ తెలిపారు. పట్టణానికి చెందిన కొత్తపల్లి పవన్, రాజమోని ప్రణీత్, ఆడెపు సాయికృష్ణలు రెండు రోజుల క్రితం సాగర్ కట్టపై బైక్ విన్యాసాలు చేసి ఇతర వాహనదారులను భయభ్రాంతులకు గురి చేశారని ఫిర్యాదు మేరకు అదుపులో తీసుకున్నట్లు పేర్కొన్నారు. ముగ్గురిని అరెస్టు చేసి బైక్ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. రంగనాయక సాగర్ రిజర్వాయర్ పరిసర ప్రాంతాల్లో ఎవరైనా బైక్ రైడింగ్ చేస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. రిజర్వాయర్ పరిసరాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి, నిఘాను పటిష్టం చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

దాడి చేసిన వ్యక్తులపై కేసు

మనోహరాబాద్(తూప్రాన్): భూ తగదా నేపథ్యంలో జరిగిన దాడిలో ఇద్దరిపై కేసు నమోదైన సంఘటన మండలంలో మంగళవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ సుభాష్‌గౌడ్ కథనం మేరకు.. కాళ్లకల్ శివారులో భూ తగదా జరిగింది. ఇందులో వర్గంటి మల్లారెడ్డి, సాయి కిరణ్ రెడ్డిలపై వర్గంటి కిష్టారెడ్డి, భరత్‌రెడ్డిలు దాడి చేసి గాయపర్చారని పోలీసులు తెలిపారు. కాగా బాధితుడు సాయికిరణ్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

గంజాయి పట్టివేత



పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): గంజాయిని తరలిస్తున్న ఓ వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్న సంఘటన రామచంద్రాపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. ఒడిశాకు చెందిన సరోజ్ కుమార్ జీవనోపాధి కోసం పటాన్‌చెరుకు వలస వచ్చాడు. బండ్లగూడ ప్రాంతంలోని కార్మికులకు గంజాయిని విక్రయించి ఎక్కువ డబ్బులు సంపాదించాలని భావించాడు. సోమవారం సాయంత్రం బైక్‌పై గంజాయిని తీసుకుని పటాన్‌చెరు నుంచి బండ్లగూడకు బయలుదేరాడు. క్రైం పోలీసులకు అందిన సమాచారం మేరకు అక్కడే ఆపి తనిఖీ చేసి అతడి నుంచి 1110 గ్రాముల సరుకు లభించింది. ఇంకా బైక్, ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. అదుపులోకి తీసుకొని మంగళవారం రిమాండ్‌కు తరలించారు.

గుట్కా ప్యాకెట్ల స్వాధీనం



స్వాధీనం చేసుకున్న గుట్కా ప్యాకెట్లను చూపుతున్న పోలీసులు

సిద్దిపేటకమాన్: ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన నిషేధిత గుట్కా ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని పోలీసులు కేసు నమోదు చేశారు. పట్టణంలోని పటేల్‌పూర కాలనీలో సంతోశ్ నివసిస్తున్నాడు. అతడి ఇంట్లో గుట్కా ప్యాకెట్లు నిల్వ ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో టాస్క్‌ఫోర్స్, టూటౌన్ పోలీసులు వెళ్లి మంగళవారం తనిఖీలు నిర్వహించగా రూ.16,680 విలువగల సరుకును స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ సీఐ ఉపేందర్ తెలిపారు.

పశువైద్యశాలల్లో మందుల కొరత

- 9 నెలలుగా నిలిచిన సరఫరా
- మెడిసిన్స్ కోసం ప్రైవేటుకు పోషకుల పరుగులు
- చికిత్సకే పరిమితమైన ఆస్పత్రులు
- గతేడాది సుమారు రూ. 5 కోట్లే కేటాయింపు



దుబ్బాక పశువైద్యశాలలో మందులు లేక వెలవెలబోతున్న స్టోర్

సాక్షి, సిద్దిపేట: పశువుల వ్యాధులు నయం చేసేందుకు, శస్త్ర చికిత్స జరిగిన జీవాలను కాపాడుకునేందుకు పశుపోషకులు నానా ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వ పశువైద్యశాలలున్నా... మందులు అందుబాటులో లేకపోవడంతో ప్రైవేట్ ఆశ్రయించాల్సి వస్తోంది. డాక్టర్లు మందులు అందుబాటులో లేవని చీటి రాసి ఇస్తుండటంతో రైతులు ప్రైవేట్ మెడికల్ షాప్‌లను ఆశ్రయిస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 9 నెలలుగా ప్రభుత్వం నుంచి మందుల సరఫరా నిలిచిపోయింది. వర్షాకాలం కావడంతో గొర్రెలకు చిటుకు రోగం, పశువుల్లో గుండె వాపు, జబ్బవాపు వ్యాధులతో పాటు రకరకాల సీజనల్ వ్యాధులు వచ్చే ప్రమాదం ఉంటుంది. ఇప్పటికైన అధికారులు అన్ని రకాల మందులను అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

గతేడాది రెండు క్వార్టర్స్ మాత్రమే..

రాష్ట్రవ్యాప్తంగా జీవాలకు వైద్యసేవలు ఆస్పత్రులు, వాహనాల 2,216 ద్వారా అందిస్తున్నారు. రాష్ట్రంలోని ఆస్పత్రులకు ప్రతీ ఏడాది సుమారు రూ.10.25కోట్ల నిధులను కేటాయిస్తారు. వీటిలో ప్రతీ మూడు నెలలకు ఒకసారి కొంత నిధులతో మందులను సరఫరా చేస్తుంటారు. 2023–24 సంవత్సరానికి రెండు క్వార్టర్స్‌లకు గాను రూ.5కోట్ల విలువ చేసే మందులను సెప్టెంబర్ 2023 వరకే సరఫరా చేశారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు సరఫరా చేయలేదు. దీంతో ఆస్పత్రుల్లో మెడిసిన్‌లు లేక వెలవెల బోతున్నాయి.

ప్రైవేట్‌ను ఆశ్రయించాల్సిందే..

వైద్యం కోసం ఆస్పత్రులకు తీసుకొస్తున్న పశువులకు డాక్టర్లు పరీక్షలు నిర్వహించి చికిత్స చేయడం మినహా వ్యాధుల నివారణకు అవసరమైన మందులను ఇవ్వడం లేదు. ఆస్పత్రుల్లో మందుల కొరతతో బయట ప్రైవేట్ మెడికల్ షాప్‌లలో తీసుకోవాలంటూ చీటీలు రాసి ఇస్తున్నారు. మందులు లేవన్న సాకుతో ప్రైవేట్ మెడికల్ షాప్‌ల నిర్వాహకులు అధిక ధరకు విక్రయిస్తున్నా తప్పని పరిస్థితుల్లో తీసుకుంటూ రైతులు అధికంగా నష్టపోతున్నారు. పశువులకు సోకుతున్న వ్యాధి నివారణకు అవసరమ్యే మందుల కోసం ప్రభుత్వం 9 నెలలుగా నిధులు కేటాయించడం లేదు. పాడి రైతులు, గొర్రెల కాపర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

రాష్ట్రంలోని ఆస్పత్రుల వివరాలు	
జిల్లా పశువైద్యశాలలు	08
ఏరియా పశువైద్యశాలలు	98
ప్రాథమిక పశువైద్యశాలలు	909
సబ్‌సెంటర్లు	1,101
1962 వాహనాలు	100

రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న జీవాలు..	
గోజాతి పశువులు	42.32లక్షలు
బర్రెలు	41.26లక్షలు
గొర్రెలు	1.90 కోట్లు
మేకలు	49.35లక్షలు

పశుసంవర్ధక శాఖ సీఎం రేవంత్ రెడ్డి వద్దనే ఉంది. ఇప్పటికైనా స్పందించి తక్షణమే మందులకు నిధులు కేటాయించాలని రైతులు కోరుతున్నారు.

నా గేదె మందులకు రూ.2వేల ఖర్చు



నా గేదెకు వ్యాధి సోకి రెండు రోజులు అవుతోంది. రెండు రోజుల నుంచి పశువుల ఆస్పత్రికి తీసుకు వచ్చాను. డాక్టరు చూసి సూదులు ఇచ్చారు. మందులు లేవని బయట ప్రైవేట్ మెడికల్‌కు రాశారు. మందులకు రూ.2 వేలు ఖర్చు అయింది. ఆరు నెలల నుంచి మందుల కొరత ఉందని డాక్టర్లు చెబుతున్నారు.

– బెల్లె కనకయ్య, రైతు దుబ్బాక

మందులు బయట కొన్నాను



నాది అక్కన్నపేట మండలం చౌటపల్లి గ్రామం. రెండు బర్రెలు, రెండు ఆవులున్నాయి. వాతావరణంలో వచ్చిన మార్పుల కారణంగా ఉదయం, సాయంత్రం పాలిచ్చే ఆవులు, బర్రెల పాలు తగ్గాయి. దీంతో ఇటీవల మల్లంపల్లి పశువైద్యశాలకు ఆవులను తీసుకువెళ్లగా పరిశీలించారు. మందులు అందుబాటులో లేవని బయట మెడికల్ షాప్‌లో కొనుక్కోండన్నారు. దీంతో బయట కొన్నాను.

– గంగాధరి శ్రీనివాస్, అక్కన్నపేట

జల్సాలకు అలవాటు పడి దొంగతనాలు

- బైక్‌లు చోరీ చేస్తున్న దొంగ అరెస్టు
- నాలుగు ద్విచక్ర వాహనాలు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న ద్విచక్ర వాహనాలను చూపుతున్న సీఐ ఉపేందర్

సిద్దిపేటకమాన్: ద్విచక్ర వాహనాలు దొంగిలిస్తున్న దొంగను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. సిద్దిపేట టూటౌన్ సీఐ ఉపేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని శ్రీనివాస నగర్‌కు చెందిన శ్రీనివాస్ కొద్ది రోజుల క్రితం తన ఇంటి ఎదుట ద్విచక్ర వాహనాన్ని పార్క్ చేస్తే గుర్తు తెలియని దుండగులు బైక్‌ను దొంగిలించినట్లు బాధితుడు టూ టౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు చేపట్టారు. మంగళవారం సీఐ ఉపేందర్ తన సిబ్బందితో కలిసి రంగీలాదాబా చౌరస్తా వద్ద వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా కొండపాక మండలం మర్పడగకు చెందిన పబ్బోజు రమేశ్ వారిని చూసి పారిపోతుండగా అదుపులోకి తీసుకున్నారు. విచారిస్తే జల్సాలకు అలవాటు పడి సులభంగా డబ్బులు సంపాదించాలనే ఉద్దేశంతో బైక్‌లు దొంగిలించినట్లు ఒప్పుకున్నాడు. నిందితుడు గతంలో 2023లో వన్ టౌన్ పరిధిలో 3 బైక్‌లు, టూటౌన్ పరిధిలో ఒక బైక్ దొంగతనం చేసిన కేసులో అరెస్టయి జైలు శిక్ష అనుభవించినట్లు పోలీసులు తెలిపారు. రెండు వారాల క్రితం కరీంనగర్‌లోని హౌసింగ్‌బోర్డు కాలనీ, సిద్దిపేట , చేర్యాల రాయపోల్‌లలో మొత్తంగా నాలుగు బైక్‌లను దొంగిలించి వాటిని చెట్లపొదల్లో దాచిపెట్టినట్లు గుర్తించారు. అతడి నుంచి వాటిని స్వాధీనం చేసుకుని అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. కాగా, సీఐ ఉపేందర్, ఎస్‌ఐ రాజేశం, కానిస్టేబుళ్లు ప్రశాంత్‌రెడ్డి, లింగం, సుధాకర్‌రెడ్డిలను ఏసీపీ మధు అభినందించారు.

ఫిరాయింపులను ప్రోత్సహించింది బావబామ్మర్దులే

- రాష్ట్ర రాజకీయాలను భ్రష్టు పట్టించింది వారే..
- మెదక్ ఎంపీ రఘునందన్‌రావు



కృతజ్ఞతా సభలో మాట్లాడుతున్న రఘునందన్‌రావు

గజ్వేల్‌రూరల్: ఫిరాయింపులను ప్రోత్సహించి రాజ్యాంగాన్ని అపహాస్యం చేసిన బావబామ్మర్దులే నేడు సన్నాయి నొక్కులు నొక్కుతుండటం వింతగా ఉందని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు మండిపడ్డారు. మంగళవారం సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణంలో బీజేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఓటరు కృతజ్ఞతా సభలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బీఆర్‌ఎస్ అగ్రనేతలైన కేటీఆర్, హరీశ్‌రావులపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. గతంలో ఇతర పార్టీల నుంచి గెలుపొందిన వారిని బీఆర్‌ఎస్‌లో చేర్చుకొని మంత్రి పదవులు ఇచ్చినప్పుడు పార్టీ ఫిరాయింపుల అంశం గుర్తుకు రాలేదా అంటూ వారిని ప్రశ్నించారు. సైకిల్ గుర్తుపై గెలుపొందిన వ్యక్తిని మీ పార్టీలోకి చేర్చుకొని మంత్రి పదవి ఎలా ఇచ్చారని ప్రశ్నించారు ? రాజకీయాల్లో విలువలుండాలని హరీశ్, కేటీఆర్‌లు మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. రాష్ట్ర రాజకీయాలను భ్రష్టు పట్టించిన బావబామ్మర్దులు గత ఎన్నికల్లో వందల కోట్లు ఖర్చు పెట్టి, ఓటుకు రూ. వెయ్యి చొప్పున పంపిణీ చేశారని ఆరోపించారు. హరీశ్‌రావు, కేటీఆర్‌తో పాటు తెలంగాణ ఉద్యమానికి తూట్లు పొడిచిన మాజీ స్పీకర్ సురేష్‌రెడ్డి సైతం రాజ్యాంగంపై ప్రమాణం చేసి ఢిల్లీలోని ఇండియా గేట్ వద్ద ముక్కు నేలకు రాసి క్షమాపణలు కోరాలన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

యువతి ఆత్మహత్య కేసులో ఇద్దరి అరెస్టు

వెల్దుర్తి(తూప్రాన్): వెల్దుర్తి గ్రామపంచాయతీ పరిధిలోని శేరీలలో మే 22న కొడె పావని(18) ఆత్మహత్య చేసుకోగా ఇందుకు సంబంధించి ఇద్దరు మహిళలను అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచినట్లు ఎస్‌ఐ నవత పేర్కొన్నారు. వ్యవసాయ పొలం అమ్మగా వచ్చిన డబ్బుల విషయంలో జరిగిన వేధింపుల వల్ల తన కూతురు మృతిచెందిందని మృతురాలి తండ్రి శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదు చేయగా నానమ్మ బాలమణి, మేనత్త మంజులను అరెస్టు చేశామన్నారు. అదేవిధంగా మరో యువతి ఆత్మహత్యకు కారణం అయిన ఇద్దరు మహిళలను, అదేరోజు దాడిచేసిన ఘటనపై మరో ఐదుగురిపై కేసు నమోదు చేశామని అన్నారు. చట్టాన్ని ఎవరైనా అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

హత్యాహత్నం కేసులో ఇరువురు సైతం..

జహీరాబాద్ టౌన్: హత్యాహత్నం కేసులో ఇద్దరిని అరెస్టు చేసి మంగళవారం కోర్టులో రిమాండ్ చేశామని జహీరాబాద్ టౌన్ సీఐ రాజబోయిన రవి తెలిపారు. కోహీర్ మండలం దిగ్వాల్‌కు చెందిన రామరాజుకు టెంట్ హౌస్ ఉంది. మండలంలోని మద్రికికి చెందిన అన్నదమ్ములు నాయికిని జగన్నాథం(46), నాయికిని శ్రీనివాస్(37)లు టెంట్ హౌస్ సామగ్రిని అద్దెపై తీసుకున్నారు. ఈ నెల 8న కిరాయి డబ్బులు అడిగినందుకు టెంట్ హౌస్ యజమానిపై ఇద్దరు కలిసి దాడి చేశారు. ఈ ఘటనలో అతడికి తీవ్రగాయాలయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు హత్యా యత్నం కింద కేసు నమోదు చేసుకుని నిందితులను అరెస్టు చేసి కోర్టులో రిమాండ్ చేశామని వివరించారు.

యువకుడి ప్రాణంమీదకు తెచ్చిన భూవివాదం

- పురుగుల మందు తాగిన యువకుడి పరిస్థితి విషమం



ఆస్పత్రితో చికిత్స పొందుతున్న కుమార్

చిన్నశంకరంపేట(మెదక్): భూ వివాదంలో పెద్దనాన్న దాడి చేసేందుకు రాగా పురుగుల మందు తాగి ఓ యువకుడు ఆత్మహత్యాయత్నం చేశాడు. ప్రస్తుతం అతడి పరిస్థితి విషమంగా ఉంది. ఈ సంఘటన మండలంలోని గజగట్లపల్లిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన సాయమ్మోల్ల కుమార్ తండ్రి, పెద్దనాన్న వెంకటయ్య కలిసి ఎకరం పొలం కొన్నారు. ఈ విషయంలో వారి మధ్య వివాదం నెలకొంది. భూమి అంతా పెద్దనాన్న స్వాధీనంలో పెట్టుకున్నాడు. అందులో తన వాటా ఇవ్వాలని మంగళవారం పొలం వద్దకు కుమార్ వెళ్లాడు. వెంకటయ్య గడ్డ పారతో దాడి చేసేందుకు సిద్ధపడగా మనస్తాపానికి గురైన అతను వెంట తెచ్చుకున్న పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. దీంతో అపస్మారక స్థితికి చేరుకోగా ఈ విషయం తెలుసుకున్న అతని కుటుంబసభ్యులు ఇక్కడికి చేరుకుని మెదక్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఇక్క చికిత్స పొందుతున్నాడు. అతడి పరిస్థితి విషమంగా ఉందని కుటుంబీకులు చెబుతున్నారు. ఈ విషయమై పోలీస్‌లు దర్యాప్తు చేస్తున్నారు.

వివరాల సేకరణ

భవనంపై నుంచి విద్యార్థిని పడిన ఘటన

రాయికోడ్(అందోల్): మండలంలోని అల్లాపూర్ శివారులోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో పదో తరగతి విద్యార్థిని హాస్టల్ భవనంపై నుంచి పడిపోయిన సంఘటనపై జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ కార్యాలయ ఔట్ రీచ్ వర్కర్ శ్రవణ్‌కుమార్ గౌడ్ మంగళవారం వివరాలు సేకరించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు పాఠశాలను సందర్శించారు. బాధిత విద్యార్థిని అందరితో స్నేహపూర్వకంగా ఉండేదని తోటి విద్యార్థినులు చెప్పినట్లు తెలిపారు. అనంతరం ఎంపీడీఓ ఎంఎం.షరీఫ్ పాఠశాలను సందర్శించి జరిగిన సంఘటనపై ప్రిన్సిపాల్ మాన్విచంద్, టీచర్లను అడిగి వివరాలు తెలుసుకున్నారు. హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో విద్యార్థిని చికిత్స పొందుతున్నట్లు ఎంపీడీఓకు తెలిపారు. మండల ప్రత్యేకాధికారి జగదీశ్వర్ ఫోన్‌లో ప్రిన్సిపాల్‌తో మాట్లాడి హాస్టల్‌లోని బాలికల భద్రత పట్ల మరింత ఎక్కువ దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ శ్యామ్ ఉన్నారు.

వాహనాలు సీజ్

అనుమతుల్లేకుండా మట్టిని తరలిస్తే కేసులు నమోదు చేస్తాం: అధికారులు

మునిపల్లి(అందోల్): అక్రమంగా మట్టిని తరలిస్తున్న వాహనాలను సీజ్ చేసినట్లు తహసీల్దార్ తెన్‌మొళి, ఎస్.సురేశ్, ఆర్‌ఐ రవీందర్‌రావు తెలిపారు. మంగళవారం మండలంలోని కంకోల్, లింగంపల్లి గ్రామాల సమీపాన ఉన్న ప్రభుత్వ భూమి నుంచి సదాశివపేటకు అక్రమంగా మట్టిని తరలిస్తున్న వాహనాలను పట్టుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. అనుమతి లేకుండా ప్రభుత్వ భూముల్లో నుంచి తరలిస్తే వాహనాలను సీజ్ చేయడమే కాకుండా యజమానులు, డ్రైవర్లపై కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు.

సూపర్‌మార్కెట్, హోటళ్లలో తనిఖీలు



గడువు ముగిసిన ఆహారపదార్థాలను పారబోస్తున్న సిబ్బంది

సిద్దిపేటకమాన్: హోటళ్లు, సూపర్‌మార్కెట్లలో నాణ్యమైన ఆహార పదార్థాలనే విక్రయించాలని జిల్లా ఫుడ్ ఇన్‌స్పెక్టర్ అధికారి అనూష అన్నారు. సిద్దిపేట పట్టణంలో ఫుడ్ సేఫ్టీ అధికారులు సూపర్ మార్కెట్, పలు హోటళ్లలో మంగళవారం తనిఖీలు నిర్వహించారు. సూపర్‌మార్కెట్‌లో గడువు ముగిసిన ఆహార పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. అలాగే హోటళ్లలో తనిఖీలు నిర్వహించి నిల్వ ఉంచిన మాంసాన్ని, ఇతర ఆహార పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గడువు ముగిసిన, కుళ్లిపోయిన ఆహార పదార్థాలను విక్రయించినా, నిల్వ ఉంచినా వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. హోటల్ నిర్వాహకులు, పనిచేసే సిబ్బంది తప్పకుండా పరిశుభ్రత పాటించాలని సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినికి అభినందనలు



సఫూరాను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

సిద్దిపేటఅర్బన్: బక్రిచెప్యాల జెడ్పీ హైస్కూల్ విద్యార్థిని మీర్జా సఫూరాను ఉపాధ్యాయులు అభినందించారు. కేంద్ర విద్యాశాఖ ఆధ్వర్యంలో గుజరాత్ రాష్ట్రంలోని వాడ్‌నగర్‌లో జూన్ 30 నుంచి జూలై 6 వరకు నిర్వహించిన ప్రేరణకు హాజరైన సందర్భంగా పాఠశాల వద్ద ఆమెకు ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం నాగేందర్‌రెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రేరణ కార్యక్రమంలో వికసిత్ భారత్ కోసం విద్యార్థులకు దేశ సంస్కృతి, సాంప్రదాయాలు, శాస్త్ర విజ్ఞానం, మహనీయుల గొప్పదనం, వారు చేసిన కృషి గురించి బాలలకు తెలియజేశారన్నారు. వాడ్‌నగర్‌లో ప్రధాని మోదీ చదివిన ప్రాథమిక పాఠశాలలో వారం పాటు నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థినితో పాటు ఉపాధ్యాయురాలు సునీత పాల్గొన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పూర్ణచంద్రరావు, అనిల్‌కుమార్, సుహాసిని, శ్రీశైలం, రాజేందర్, రమాదేవి, లక్ష్మయ్య, సునీత, ఆగయ్య, శ్రీనివాస్, ఆంజనేయులు, సరిత పాల్గొన్నారు.

గ్రామాల మధ్య కరెంట్ లైన్ చిచ్చు



పాంపల్లి చెరువులోకి నీరు రాకుండా కాల్వ తీసేందుకు వెళ్తున్న కంచన్‌పల్లి గ్రామస్తులు



కోళ్లఫారానికి అడ్డుగా తీసిన కాల్వ

కౌడిపల్లి(నర్సాపూర్): నిర్మాణంలో ఉన్న ఓ ప్లాస్టిక్ కంపెనీకి కరెంట్ లైన్ విషయమై రెండు గ్రామాల మధ్య గొడవకు కారణమైంది. ఈ సంఘటన మంగళవారం కంచన్‌పల్లి, పాంపల్లి మధ్యలో జరిగింది. ఆయా గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. కంచన్‌పల్లికి చెందిన ఎన్‌ఆర్‌ఐ.. ధర్మాసాగర్ శివారులో పాంపల్లి దగ్గరగా ప్లాస్టిక్ కంపెనీ నిర్మిస్తున్నాడు. దీనికి కంచన్‌పల్లి సబ్‌స్టేషన్ నుంచి కరెంట్ లైన్ వేసేందుకు విద్యుత్ శాఖకు డీడీ చెల్లించాడు. స్తంభాలు వేస్తుండగా తమ సాగు భూమిలో నుంచి వేయొద్దని పాంపల్లి గ్రామస్తులు అడ్డుకున్నారు. అక్కడ కాకుండా రోడ్డు పక్క నుంచి వేసేందుకు ఏర్పాట్లు చేసి స్తంభాలు పాతితే చెట్లకు నష్టం జరిగితే ఎలాగని పంచాయతీ కార్యదర్శి రేణుక పోలీసులకు, ఆర్‌అండ్‌బీ అధికారులు ఫిర్యాదు చేశారు. కాగా, కరెంట్ స్తంభాలను పాంపల్లి గ్రామస్తులు అడ్డుకున్నారని కంచన్‌పల్లి గ్రామస్తులు తమ శివారు భూమిలో కురిసిన వర్షం నీరు పాంపల్లి చెరువులోకి వెళ్లకుండా కాల్వ తీశారు. వేరే గ్రామం కోళ్లఫారానికి సైతం వెళ్లకుండా రోడ్డుకు అడ్డుగా మరో కాల్వ తీశారు. కరెంట్ సరఫరా సైతం తొలగిస్తామని హెచ్చరించారు. కరెంట్ లైన్ వేయనిస్తేనే గ్రామ శివారులోకి రానిస్తామని హెచ్చరించారు. అయితే ఆర్‌అండ్‌బీ నర్సాపూర్ డీఈ శ్రీనివాస్ సంఘటన స్థలానికి వచ్చి పరిశీలించి, స్తంభాలు రోడ్డు పక్కన సైడ్ బర్మ్ కింద చెట్లకు నష్టం కలగకుండా వేసుకోవాలని సూచించారు. దీనిపై మరోసారి చర్చించి సమస్యను పరిష్కరించేలా చూస్తామని ఎస్‌ఐ రంజిత్‌రెడ్డి, విద్యుత్‌శాఖ ఏఈ కోటేశ్వరావు తెలిపారు.

వరినారు తీసుకొని తిరిగి వెళ్తుండగా..

బైక్‌ను ఢీకొన్న ఇద్దరు మృతి



మృతులు జైపాల్‌రెడ్డి, శంబు

చేగుంట(తూప్రాన్): బైక్‌ను లారీ ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు మృతిచెందారు. ఈ సంఘటన మండలంలోని వడియారం శివారు తండా రోడ్డులో మంగళవారం చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వెల్దుర్తి మండల నాగులపల్లికి చెందిన కావేరిగారి జైపాల్‌రెడ్డి(47), ఇద్దరు కూలీలతో తన బైక్‌పై రామంతపూర్‌తండాకు నారు కోసం వచ్చి తీసుకొని తిరిగి వెళ్తున్నాడు. వడియారం శివారులోని రైల్వే బ్రిడ్జి సమీపాన ఉన్న మలుపు వద్ద వేగంగా వస్తున్న లారీ వీరు ప్రయాణిస్తున్న వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో జైపాల్‌రెడ్డి అక్కడికక్కడే మృతిచెందాడు. శంబుమండల్(32) ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో చనిపోయాడు. తీవ్ర గాయాలైన హర్షిత్‌మండల్‌ను చికిత్స నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. కేసు నమోదు చేసి లారీ డ్రైవర్ బంటును అదుపులోకి తీసుకున్నారు. కూలీలు పశ్చిమబెంగాల్ వాసులుగా గుర్తించి వారి బంధువులకు సమాచారం అందించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

యూటర్న్ తీసుకుంటుండగా..



మల్లం శ్రీనివాస్

కొండపాక(గజ్వేల్): ద్విచక్ర వాహనాన్ని వెనుక నుంచి కారు ఢీకొట్టడంతో వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సంఘటన దుద్దెడ శివారు రాజీవ్ రహదారిపై మంగళవారం చోటుచేసుకుంది. త్రీ టౌన్ సీఐ విద్యాసాగర్ కథనం ప్రకారం.. దుద్దెడ మధిర సెలంపుకు చెందిన మల్లం శ్రీనివాస్(38) వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. దినచర్యలో భాగంగా ఉదయం సెలంపు నుంచి దుద్దెడకు పాలను తీసుకు రావడానికి ద్విచక్ర వాహనంపై వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో సెలంపునకు యూటర్న్ తీసుకుంటుండగా హైదరాబాద్ నుంచి కరీంనగర్ వెళ్తున కారు వేగంగా వచ్చి బైక్‌ను వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో ఎగిరి కింద పడ్డ శ్రీనివాస్ అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కుటుంబీకులు సంఘటన స్థలానికి చేరుకొని విలపించారు. నిందితుడు కారును వదిలి పరారయ్యాడు. పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు మంచిర్యాల జిల్లాలోని లక్సెట్టిపేటకు చెందిన వ్యక్తిగా గుర్తించారు. ఈ మేరకు శ్రీనివాస్ భార్య రేణుక ఫిర్యాదుతో నిందితుడిపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని సీఐ పేర్కొన్నారు.

నీటి ట్యాంకర్‌ను ఢీకొని..



ప్రమాదస్థలంలో గాయపడిన విజయ్‌కుమార్

నంగునూరు(సిద్దిపేట): రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలైన ఉద్యోగి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ సంఘటన మంగళవారం బద్దిపడగలో చోటుచేసుకుంది. రాజగోపాల్‌పేట ఎస్‌ఐ భాస్కర్‌రెడ్డి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. హన్మకొండ జిల్లా పరకాలకు చెందిన నేరెళ్ల విజయ్‌కుమార్ (36) సిద్దిపేటలోని ఇంటిగ్రేటెడ్ ఎస్సీ బాలుర హాస్టల్‌లో కామాటిగా విధులు నిర్వహిస్తున్నాడు. కుటుంబ సభ్యులతో కలిసి హుస్నాబాద్‌లో నివాసముంటున్న విజయ్‌కుమార్ మంగళవారం ఉదయం డ్యూటీ నిమిత్తం బైక్‌పై సిద్దిపేటకు బయలుదేరాడు. రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా బద్దిపడగలో రోడ్డుపై నిలిపిన నీటి ట్యాంకర్‌ను బైక్ ఢీ కొనడంతో అతడి తల, ముక్కుకు తీవ్రగాయాలయ్యాయి. సమాచారం అందుకున్న 108 అంబులెన్స్ సిబ్బంది విజయ్‌కుమార్‌ను సిద్దిపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఇక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. అతని భార్య వాణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.